క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి నాయకుల, కార్యకర్తల సమావేశం ఈ నెల 23న శుక్రవారం ఉదయం 9.30 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో జరుగుతుందని పార్టీ కార్యాలయ ప్రతినిధి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, మున్సిపల్ చైర్మన్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పార్టీ అన్ని అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా హాజరు కావాలని కోరారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో భూమి కాలుష్యం



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రామాంజనేయులు

కొండపి: ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణానికి ఎంతో ముప్పని ఎంపీడీఓ రామాంజనేయులు అన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సచివాలయం-1 నుంచి బస్టాండ్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించి కరపత్రాలు అందజేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, ప్రజలకు, వ్యాపారస్తులకు సూచించారు. ఈఓఆర్డీ అంజలీదేవి, వీఆర్వో సుశీల, పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌రావు, డి.ఏ కోటిరత్నం తదితరులు పాల్గొన్నారు.

20 మంది విద్యార్థులు గైర్హాజరు



బాలికల ఉన్నత పాఠశాల వద్ద వేచి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

సింగరాయకొండ: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షకు గురువారం 20 మంది గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణాధికారి రామారావు తెలిపారు. గణితం పరీక్షకు అన్ని మండలాల నుంచి 203 మంది హాజరు కావాల్సి ఉండగా 183 మంది హాజరయ్యారు.

ఆంగ్లం, గణితంలో పట్టు సాధించాలి

సీఎస్‌పురం(పామూరు): విద్యార్థులు ఆంగ్లం, గణితంలో పట్టు సాధిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని హెచ్‌ఎం యస్.వెంకటరామయ్య అన్నారు. సీఎస్‌పురం పాఠశాలలో లైబ్రేరియన్ అళ్ల భాస్కరరావు ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన తరుగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులకు ఆంగ్లం, గణితంలో మెళకువలపై శిక్షణ నిచ్చారు. నీతికథలు వివరించారు. ఉపాధ్యాయులు భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ గోళ్లమూడి సుందరరామిరెడ్డి మృతి



గోళ్లమూడి సుందరరామిరెడ్డి

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, పాకల మాజీ సర్పంచ్ గోళ్లమూడి అశోక్‌కుమార్‌రెడ్డి గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన 1984-94 వరకు సర్పంచ్‌గా విధులు నిర్వహించారు. 1994లో పీబీ ఛానల్ పరిధిలో సాగునీటి సంఘం అధ్యక్షునిగా పనిచేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షునిగా పనిచేశారు. ఈయన మృతికి పలువురు డాక్టర్లు, నాయకులు, గ్రామస్తులు సంతాపం తెలిపి నివాళులర్పించారు.

అంబేడ్కర్ జయంతోత్సవాన్ని జయప్రదం చేయాలి



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అశోక్‌బాబు

టంగుటూరు: జరుగుమల్లి మండలం చింతపల్లిలో ఈనెల 24వ తేదీన అంబేడ్కర్ 134వ జయంతోత్సవాన్ని నిర్వహించనున్నట్లు రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తులిబిల్లి అశోక్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా టంగుటూరులోని అంబేడ్కర్ పార్క్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ 134వ జయంతోత్సవానికి అంబేడ్కర్ మనవడు భీమారావు యశ్వంత్ అంబేడ్కర్ పాల్గొంటున్నారని. కార్యక్రమంలో భాగంగా టోల్గేట్ నుంచి టంగుటూరు బొమ్మల సెంటర్ మీదుగా అడ్డరోడ్డు నుంచి చింతలపాలెం వరకు భారీ ర్యాలీతో ఘన స్వాగతం పలకాలని కోరారు. ఎం. బాలకోటయ్య,చంద్రబాబు, క్రాంతి, ధనకిరణ్, నానీ, చిన్ని, ప్రశాంత్, బాలరాజు, ఆనంద్, వంశీ, నరేష్, రాయుడు, శివకృష్ణ పాల్గొన్నారు.



కందుకూరు ఫ్లైఓవర్ జంక్షన్ వద్ద



శ్రీరాంనగర్ సమీపంలో నూతనంగా నిర్మించిన కల్వర్టు

నత్తనడకన నిర్మాణ పనులు

- గుంతల మయంగా రోడ్డు
- ఇబ్బందుల్లో వాహనదారులు
- రోడ్డు నిర్మాణ పనుల్లో గతంలో ఒకరు మృతి
- పనుల చేయడంలో అధికారుల తాత్సారం



బాలయోగినగర్ జంక్షన్ వద్ద అధ్వాన్నంగా ఉన్న రోడ్డు



గుజ్జుల యలమందారెడ్డినగర్ సమీపంలో రోడ్డు దుస్థితి

సింగరాయకొండ:

రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే..మండల కేంద్రంలోని కందుకూరు ఫ్లైఓవర్ నుంచి ఊళ్లపాలెం కటింగ్ దగ్గర ఆర్చి వరకు సుమారు ఒకటిన్నర కిలోమీటరు దూరం తారురోడ్డు నిర్మాణానికి సుమారు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ఆర్‌అండ్‌బీ అధికారులు ఏడాది క్రితం ప్రతిపాదనలు పంపారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు పథకం నిధులతో ఈ రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి సుమారు ఏడాదవుతున్నా ఇంత వరకు రోడ్డు నిర్మాణం పూర్తి కాకపోవడంపై వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం సార్వత్రిక ఎన్నికల సమయంలో ఈ రోడ్డు నిర్మాణ పనులలో భాగంగా రోడ్డు మార్జిన్లో ఉన్న చెట్లను నరికేశారు. ఆరునెలల క్రితం రోడ్డు నిర్మాణంలో భాగంగా శ్రీరాంనగర్ వద్ద కల్వర్టు నిర్మించారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణానికి సంబంధించి కంకర తోలి నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

గుంతలమయంగా రోడ్డు

ఈ రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంతల కారణంగా తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఈ ప్రాంతంలో రాత్రిళ్లు విద్యుత్ వెలుగులు లేకపోవటంతో చీకట్లో గుంతల కారణంగా తరుచు ప్రమాదాలు జరుగుతూ గాయాల పాలవుతున్నామని వాహనదారులు ఆరోపిస్తున్నారు. శ్రీరాం నగర్ కల్వర్టు నిర్మాణ సమయంలో సరైన భద్రతా చర్యలు పాటించకపోవటంతో ఆ ప్రాంతానికి చెందిన వ్యక్తి కల్వర్టు కోసం తీసిన గుంతలోపడి మరణించాడు. ఈ రోడ్డు పనులు త్వరగా ప్రారంభించి వాహనదారుల ఇబ్బందులు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

> **అనుమతులు రాగానే ప్రారంభిస్తాం:**
>
> న్యూ డెలవప్‌మెంట్ బ్యాంకు పథకం నిధులతో సుమారు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాం. అయితే పనులు జాప్యం కారణంగా తిరిగి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభించి వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం.
>
> మాధవరావు, ఆర్‌అండ్‌బీ ఏఈ

గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి

- ప్రభుత్వ రంగ సంస్థలను వెంటనే రంగంలోకి దించాలి
- లో గ్రేడ్ పొగాకు వెంటనే కొనుగోలు చేయాలి
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్



వేలం నిర్వహణాధికారితో మాట్లాడుతున్న రైతు సంఘ నేతలు

కొండపి: పొగాకు రైతుకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని, పొగాకు రైతులను ఆదుకునేందుకు బోర్డు జోక్యం చేసుకొని ప్రభుత్వ సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. స్థానిక కొండపిలోని పొగాకు వేలం కేంద్రాన్ని రైతు సంఘం నాయకులు గురువారం సందర్శించి వేలం తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి బుజ్జారి జయంతి బాబు, పమిడి వెంకట్రావు, ఎస్‌కే మాబు మాట్లాడుతూ రైతులు వేలానికి తెస్తున్న బేళ్లను తిరస్కరించడంతో రైతులు ఎంతో నష్టం కలుగుతుందో తెలుసా అని నిర్వాహకులను ప్రశ్నించారు. కనిష్ఠ ధర కేజీ రూ.200 తగ్గించడం అత్యంత దారుణమన్నారు. గత ఏడాది రూ.360లకు కొనుగోలు చేసి, పెరిగిన ధరల నేపథ్యంలో ధరలను పెంచాల్సింది పోయి ఇష్టంవచ్చినట్లు తగ్గించడం దారుణమన్నారు. ఈ ఏడాది విస్తీర్ణం పెరిగిన దిగుబడి తగ్గిందని, అనుమతించిన మేరకు కొనుగోలు చేయనప్పుడు ఎందుకు అనుమతించారని అధికారులు, బయ్యర్లను రైతు సంఘం నేతలు ప్రశ్నించారు. మార్కెట్ ఇదే రీతిలో కొనసాగితే ఈ ఏడాది పొగాకు పండించిన రైతులకు తీవ్ర నష్టాలు వాటిల్లుతాయన్నారు. బ్యారన్‌కు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లుతుందన్నారు. బ్రౌన్ కలర్ పొగాకును రూ.28 వేలకు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందని కానీ కంపెనీలు రూ.20వేలకే కొనుగోలు చేయడం వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వేలం ప్రారంభంలో కనిష్ఠ ధర రూ.240 ఉండగా ఇప్పుడు రూ.200 పడిపోయిందని, బయ్యర్లు సిండికేట్ కావడం వల్లే ఈ పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మార్క్‌ఫెడ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను రంగంలో దించాలని డిమాండ్ చేశారు. వెంటనే లో గ్రేడ్ పొగాకును కూడా కొనుగోలు ప్రారంభించాలని, రైతు సంఘం జిల్లా నాయకులు అబ్బూరి వెంకటేశ్వర్లు, బెజవాడ శ్రీనివాసులు, ముప్పరాజు చిన్న బ్రహ్మయ్య,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కేజీ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టా మహోత్సవ పూజల్లో దద్దాల



తిరగలదిన్నెలో ప్రతిష్టా మహోత్సవంలో పూజల్లో దద్దాల, నేతలు

పామూరు: మండలంలోని తిరగలదిన్నెలో మేధా దక్షిణామూర్తి విగ్రహప్రతిష్టా మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్‌ పలువురు నేతలు విగ్రహ ప్రతిష్టలో పాల్గొని పూజలు చేశారు. దద్దాలను సర్పంచ్, ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది. ఇన్‌చార్జ్ దద్దాల భూమిరెడ్డిపల్లె గ్రామంలో నాయకులతో కలిసి ఆంజనేయస్వామి ఆలయ పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, కల్లూరి రామిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్.చాంద్ బాషా, సర్పంచ్ పిన్నిక రత్తయ్య, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, షేక్.గయాజ్‌బాషా, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, శ్రీరాం శ్రీనివాసులు, ఎలికా అచ్చయ్య, బారాషరీఫ్, జి.ఆదినారాయణరెడ్డి, కటికల వెంకటరత్నం, పి.రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు



వీరాంజనేయ స్వామి ఆలయంలో పూజలు



కనిగిరిలో శోభాయాత్ర



కనుమళ్ల రోడ్డు జంక్షన్ వద్ద ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ట



పొన్నలూరులో పూజలు చేస్తున్న నేతలు



రాజుపాలెంలో కల్యాణం..



సాయినగర్‌లో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



సీఎస్‌పురంలో ఆంజనేయస్వామి పూజల్లో పాల్గొన్న భక్తులు



పామూరులో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

సింగరాయకొండ: మండలంలోని హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమరాజుపల్లి పంచాయతీ సాయినగర్‌లో ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఊళ్లపాలెం సర్పంచ్ పాకనాటి అనసూర్యమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, పులగం నారాయణరావు, పాకనాటి సుబ్బారెడ్డి, కాళహస్తి వెంకారెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పఠాన్ రియాజ్, సామంతుల రవికుమార్‌రెడ్డి, బిళ్లా కోటేశ్వరరావు పాల్గొన్నారు. కనుమళ్ల జంక్షన్ వద్ద జాతీయరహదారి పక్కన ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రతిష్ట చేశారు. విగ్రహదాత రాచకొండ శ్రీనివాసరావు, అంజనీదేవి ప్రత్యేక పూజలు హోమాలు, అన్నదానం నిర్వహించారు. పాతసింగరాయకొండ పంచాయతీ అయ్యప్పనగర్‌లోని అయ్యప్పస్వామి దేవస్థానంలో, రైల్వేస్టేషన్ రోడ్డులోని కోదండరామస్వామి దేవస్థానంలో ఆంజనేయునికి పూజలు చేశారు.

పొన్నలూరు: మండలంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకొని అభిషేకం, ఆకుపూజ, సింధూరం పూజలు, పాలాభిషేకాలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. పైదిపాలెంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రం సి.నాగులవరంలోని వీరభద్ర వీరాంజనేయస్వామి ఆలయం, కోవిలంపాడు, రెడ్డిగానిపల్లె, కొత్తపల్లె, అగ్రహారం పాటు పలు గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించారు. అర్చకులు పద్మనాభయ్య ఆంజనేయస్వామి మూల, ఉత్సవ విగ్రహమూర్తులకు అభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం ఆకుపూజ నిర్వహించారు. సాయంత్రవేళ స్వామి గ్రామోత్సవం కనులపండువగా సాగింది. అనంతరం అన్నదానం చేశారు. బ్రాహ్మణసంఘం మండల అధ్యక్షుడు ఆకుమళ్ల చలపతిరావు, నేతలు పాల్గొన్నారు.

వీసీపల్లి: మండల పరిధిలోని పెద అలవలపాడు, పెదయిర్లపాడు, వీసీపల్లి, మారెళ్ల గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అలవలపాడులో ఒంగోలు జాతి పశు ప్రదర్శన పోటీలు నిర్వహించారు.

పామూరు: పామూరు మదన వేణుగోపాలస్వామి దేవాలయంలో ఉన్న ఆంజనేయస్వామి, కాపువీధి ఆలయంతో పాటు మండలంలోని ఇనిమెర్ల, మోపాడు, బొట్లగూడూరుతో పాటు పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆకుపూజ, సింధూర పూజ, కథలి, చందన, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో హనుమత్‌శోభాయాత్ర కనులపండువగా సాగింది. యారవ శ్రీనివాసులు, బైరెడ్డి జయరామిరెడ్డి, బొల్లా నరసింహారావు, జమకాల నరేష్, బీజేపీ నాయకులు కేవీ రమణయ్య, ఇర్రి కోటిరెడ్డి, పందిటి హరీష్, వరదా ఓబులేసు, సిద్ధమూర్తి భానుప్రతాప్‌రెడ్డి, ఒగూరి ఏడుకొండలు, మల్లికార్జున, గుత్తి కొండలరావు పాల్గొన్నారు.

మర్రిపూడి: మండలంలోని రాజుపాలెం అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు నుదురుపాటి అంబణ్ణ పంతులు స్వామిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గంగ్రకోట సురేంద్ర శర్మ వేదమంత్రోచ్చరణతో స్వామి కళ్యాణాన్ని జరిపించారు. చెన్నారెడ్డి నర్సింహారెడ్డి, కోయవారిపాలెం సుబ్బారావు దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. గ్రామస్తులు సహాయసహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కనిగిరిరూరల్: హనుమజ్జయంతిని పురస్కరించుకొని హనుమాన్ శోభ యాత్ర ర్యాలీని కనిగిరిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణ పురవీధుల్లో సాగింది. ర్యాలీని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రారంభించారు. ర్యాలీలో హనుమంతుని, ఛత్రపతి శివాజీ ల భారి విగ్రహాలను ఏర్పాటు చేశారు. డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ పర్యవేక్షణలో ర్యాలీ సాగింది. శోభయాత్ర కమిటీ నాయకులు వడ్డిపాటి వెంకటేష్, కోడూరి పెద్దిరెడ్డి, ఎం శేఖర్, నవీన్, ప్రసన్న కుమార్, నరాల శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: హనుమజ్జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని గార్లపేట రోడ్డులో ఉన్న హనుమాన్ భజన సంఘం, కొత్తపేటలోని కోదండరామస్వామి ఆలయం, రామాలయం వీధిలో వీరాంజనేయ స్వామి ఆలయం, కొత్తూరు, శంఖవరంలోని అభయాంజనేయ స్వామి ఆలయాల్లో స్వామికి విశిష్ట పూజలు జరిగాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న హనుమంతుని ఆలయాల్లో స్వామికి విశిష్ట పూజలు చేశారు. ఆలయ కమిటీల పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగాయి.

శీతల గిడ్డంగుల్లో బేళ్ల వివరాలు తెలియజేయాలి



కొండపిలో వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి సునీల్‌కుమార్



వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి శ్రీనివాసరావు

కొండపి: శీతల గిడ్డంగుల్లో ఉన్న బేళ్ల వివరాలను తెలియజేయాలని వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్ అన్నారు. గురువారం వేలం సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ దగ్గర ఉన్న బేళ్ల వివరాలను బోర్డుకు తెలియపరచాలని, అనధికారికంగా పొగాకును అమ్మరాదని సూచించారు. గురువారం నిర్వహించిన వేలంలో క్లస్టర్ పరిధిలోని గోగినేనివారిపాలెం గ్రామానికి చెందిన రైతులు 571 బేళ్లను వేలానికి తీసుకురాగా 502 బేళ్లను కొనుగోలు చేసి 69 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.200, సరాసరి ధర రూ.255.91గా నమోదైంది. వేలంలో 20 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో పొగాకు గరిష్ఠ ధర రూ. 280 పలికిందని వేలం నిర్వహణ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కారుమంచి గ్రామానికి చెందిన రైతులు 450 బేళ్లను తీసుకురాగా 349 బేళ్లను కొనుగోలు చేసి 101 బేళ్లను త్రస్కరించారు. కనిష్ఠ ధర రూ.205, సరాసరి ధర రూ.239.66గా నమోదైంది. వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యం రక్షణతోనే మనుగడ



మొక్కలు నాటుతున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: జీవ వైవిధ్యం రక్షణతోనే జీవరాశుల మనుగడ సాధ్యమని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. గ్రంథలయ శాఖ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ జీవ వైవిధ్యం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో చైర్మన్ గఫార్ మాట్లాడుతూ జీవ వైవిధ్యం మానవ మనుగడకు అత్యంత అవసరమైందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వనరులను పరిరక్షించాలన్నారు. అనంతరం మొక్కలను నాటారు. జేవీవీ నాయకులు గయాజ్ బాష, గ్రంధపాలకు ఎస్‌కే అహమ్మద్ షరీఫ్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మంద్రు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తీరంలో అనుమానితుల సమాచారం తెలపండి



మత్స్యకారులతో మాట్లాడుతున్న మెరైన్ సీఐ శివన్నారాయణ

సింగరాయకొండ: పాకల సముద్రతీరంలో కొత్త వ్యక్తుల కదలికలు గమనిస్తూ, అనుమానితుల సమాచారం ఎప్పటికప్పుడు మెరైన్ పోలీసులకు అందించాలని రామాయపట్నం మెరైన్ సీఐ జి.శివన్నారాయణ మత్స్యకారులకు సూచించారు. మండలంలోని పాకల పంచాయతీ శాంతినగర్, క్రాంతినగర్‌లో గురువారం మధ్యాహ్నం తీరప్రాంత భద్రతపై మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో మత్స్యకారులకు అవగాహన కల్పించారు. మెరైన్ సీఐ శివన్నారాయణ మాట్లాడుతూ దేశభద్రత దృష్ట్యా తీరంలో టెర్రరిస్టులు, అసాంఘిక శక్తులు తిరిగే అవకాశం ఉందన్నారు. అనుమానం వస్తే టోల్ ఫ్రీ నంబర్‌కు 1093కు సమాచారం ఇవ్వాలని సూచించారు. వేట నిషేధ సమయంలో వేటకు వెళ్లవద్దని, అక్రమ రవాణాను అరికట్టేందుకు సహకరించాలని సూచించారు. మెరైన్ ఎస్సై పి.ఈశ్వరయ్య, హెడ్ కానిస్టేబుల్ ఎం శ్రీనివాసులరెడ్డి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.